సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 19 । డిసెంబర్ । 2024



హైవేపై దారి దోపిడీ
కొందరు దుండగులు యాత్రికులపై కత్తులు, రాళ్లతో దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు.

వివరాలు 8లో ▸



దిగి వచ్చిన ఉల్లి ధర
దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి ధర గత వారం కంటే రూ.1,500 వరకు తగ్గింది.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 36.1 /11.9

ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



పాలమూరు: ప్రజలు అన్ని రకాల చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ఏదైనా సమస్యలు ఉంటే లోక్ అదాలత్ దృష్టికి తీసుకురావాలని, ఇందులో న్యాయవాదులు సూచనలు, సలహాలు అందిస్తారని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళ చట్టాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్, పోక్సో యాక్ట్, డీవీసీ, బాలల హక్కులు, బాధ్యతలు, ఫ్రీ లీగల్ ఎయిడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని జరీనా బేగం, సౌజన్య, జ్యోతి పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



అడ్డాకుల: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం అడ్డాకుల గ్రంథాలయాన్ని పరిశీలించిన ఆయన అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠకులకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది కుర్మయ్య, నాయకులు దశరథ్‌రెడ్డి, సయ్యద్ షఫి, శరత్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

కందులు క్వింటాల్ రూ.7,999

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్ యార్డులో బుధవారం కందులు క్వింటాల్ గరిష్టంగా రూ.7,999, కనిష్టంగా రూ.5,666 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్టంగా రూ.6,764, కనిష్టంగా రూ.3,052, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,471, కనిష్టంగా రూ.2,435, ధాన్యం హంస గరిష్టంగా రూ.2,221, కనిష్టంగా రూ.1,629, ఆర్‌ఎన్‌ఆర్ గరిష్టంగా రూ.2,693, కనిష్టంగా రూ.1,686, పత్తి గరిష్టంగా రూ.6,739, కనిష్టంగా 5,489, ఆముదాలు రూ.5,940 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,679, కనిష్టంగా రూ.2,609, కందులు గరిష్టంగా రూ.8,159, కనిష్టంగా రూ.7,689గా ధరలు లభించాయి.

చలికాలం.. చిరుధాన్యాలే మేలు

- జనరల్ ఆస్పత్రి న్యూట్రిషనిస్టు శైలజ



చలి కాలంలో చిరుధాన్యాల వినియోగం, ఆకుకూరల సమాహారమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు పాలమూరు జనరల్ ఆస్పత్రి న్యూట్రిషనిస్టు శైలజ. ఆ వివరాలు ఆమె మాటల్లో.. శరీరానికి వేడిని అందించే ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిది. చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎలాంటి అనారోగ్య సమస్యలూ రావు. శరీరంలో వేడిని పెంచేందుకు రాగులు, జొన్నల, కొర్రలతో చేసిన జావలు తాగడం మంచిది. తేనె, నిమ్మరసం కలిపిన గోరువెచ్చటి నీళ్లు తాగితే మలబద్ధక సమస్యతో పాటు శరీరం ముడతలు పడకుండా చూస్తుంది. రాగులు, సామ బియ్యం, మొక్కజొన్న, కొర్రలు, జొన్నలు, తోట కూర గింజలు, కోడిసాము, సజ్జలు వరిగెలు, నువ్వులు ఆరోగ్యకర ఆహారం. శీతాకాలంలో కండరాలు పట్టేయడం వంటి సహజ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. నువ్వులు తగిన మోతాదులో తీసకుంటే కాల్షియం, మాంగనీసు, ఇనుప ఖనిజాలు అందుతాయి. భోజనం తర్వాత నువ్వులతో చేసే మిఠాయిలు తినడం ద్వారా సరిపడా తేమ సమకూరుతుంది. వేరుసెనగతో గుండెకు మేలు. శీతాకాలంలో అందుబాటులో ఉన్న ఆకుకూరలన్నీ అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లనందిస్తాయి. ప్రతి రోజు ఆహారంలో తక్కువలో తక్కువ 400 గ్రాములు పండ్లు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి.



- పాలమూరు

నారుమళ్లలో నీరు లేకుండా చూసుకోవాలి



- ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం



కొన్ని రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వరి నార్లు, మిరపనార్లు తదితర పంటల విషయంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..'చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు వరి నారు మొదటి దశ నుంచే రైతులు జాగ్రత్తలు పాటించాలి. నారుమళ్లలో నిలిచిన నీటిని సాయంత్రం వేళల్లో పూర్తిగా తొలగించాలి. ఉదయం పూట మళ్లీ నారుమడిని నీటితో నింపాలి. రాత్రి వేళల్లో నారుమళ్లలో నీరు లేకుండా చూసుకుంటే చలి నుంచి రక్షణ ఉంటుంది.

- మిర్చి నార్లు, ఇతర పంటలు ఏవైనా రసాయనిక ఎరువులను తక్కువ మోతాదులో దశల వారీగా వినియోగించాలి.
- చలి ఎక్కువ ఉండటంతో నారు జింక్ ధాతువును శోషించుకునే గుణం తగ్గిపోతుంది. అందువల్ల నారుకు అవసరమైన పోషకాలు అందవు. ఇందుకోసం కృత్రిమంగా జింక్‌ను స్ప్రే ద్వారా అందించాలి. వారానికి ఒకసారి చొప్పున మొత్తానికి రెండుసార్లు యూరియాతో కలిపి స్పింట్‌ను స్ప్రే చేస్తే మంచి ఫలితం ఉంటుంది. లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలపి స్ప్రే చేయాలి.

- సాక్షి, నాగర్‌కర్నూల్

సీన్‌రివర్స్..!

ఎస్‌డబ్ల్యూహెచ్ గోడౌన్‌లో గోల్‌మాల్ ఘటనలో భారీ మలుపు



బియ్యం చోరీకి గురైంది ఈ గోడౌన్ నుంచే..

- 680 మె.ట., రేషన్‌బియ్యం మాయంలో తేలిన సూత్రధారి
- పెద్దలతో కలిసి చక్రం తిప్పిన వ్యాపారవేత్త.. రూ.5 కోట్ల జరిమానాకు చెల్లుచీటీ
- దొంగిలించిన బియ్యాన్ని అప్పగిస్తామని ప్రతిపాదన
- పెద్దల సూచనలతో పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌లో ఆగిన ఫైల్
- జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని స్టేట్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో భారీఎత్తున చోటుచేసుకున్న బియ్యం గోల్‌మాల్ ఘటన కీలక మలుపు తీసుకుంది. ఈ బాగోతంలో అసలు సూత్రధారి ఎవరనేది తేలిపోయినప్పటికీ.. పౌర సరఫరాల శాఖ చర్యలు చేపట్టలేక చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారులు సదరు సూత్రధారికి ఉన్న రాజకీయ పలుకుబడి చూసి నివ్వెరపోయినట్లు సమాచారం. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక కొట్టుమిట్టాడుతున్నారు.

అసలేం జరిగిందంటే

ఎస్‌డబ్ల్యూహెచ్ గోదాం–2లో పేదలకు చేరాల్సిన సుమారు 680 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమైంది. ఈ మేరకు నెల క్రితమే గుర్తించిన జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయికి నివేదిక సమర్పించారు. గోదాంల నిర్వహణ బాధ్యత స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌ది కావడంతో ఆమె వెంటనే పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌కు రిపోర్ట్ చేశారు. దొంగతనానికి గురైన బియ్యం విలువ రూ.2.50 కోట్లుగా నిర్ధారించిన రాష్ట్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ తతంగంలో అసలు సూత్రధారి గోడౌన్ నిర్వాహకుల్లో ఒకరు, రాజకీయ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఓ వ్యాపారవేత్త అని గుర్తించిన వారు.. అసలుతో సహా జరిమానా కలిపి మొత్తం రూ.5 కోట్లు రికవరీ చేసేందుకు ఉపక్రమించారు.



పెద్దలతో కలిసి చక్రం..

కమిషనరేట్ యంత్రాంగం వేగంగా చర్యలకు ఉపక్రమించడం.. గతంలో ఎన్నడూ లేని విధంగా జరిమానా వేయడం వంటి ఊహించని పరిణామాలతో కంగుతిన్న వ్యాపారవేత్త తన రాజకీయ పలుకుబడితో చక్రం తిప్పినట్లు ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. తనకున్న సాన్నిహిత్యంతో సర్కారులోని ఓ ముగ్గురు పెద్దలతో మంతనాలు జరిపినట్లు సమాచారం. దొంగిలించిన బియ్యాన్ని అప్పగిస్తామని ప్రతిపాదించడమే కాకుండా.. జరిమానా వేయకుండా చూడాలని కోరినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. సదరు వ్యాపారవేత్తకు పెద్దలు అండగా నిలవడంతో జరిమానాకు సంబంధించిన ఫైల్ కమిషనరేట్‌లోనే ఆగినట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అధికారులకే చీవాట్లు..?

జిల్లా అధికార యంత్రాంగం చొరవ తీసుకునేలా చూడాలని రాష్ట్రస్థాయి అధికారులు సూచించగా.. వారికి పెద్దల నుంచి చీవాట్లు ఎదురైనట్లు వినికిడి. ఈ విషయాన్ని కప్పి ఉంచడంలో విఫలమయ్యారు. ఈ రాద్ధాంతానికి కారణం మీరే.. ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పెట్టండి.. అని పెద్దలు కోపం ప్రదర్శించినట్లు ఉద్యోగ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ అంశంపై చర్చించేందుకు జిల్లాకు చెందిన సివిల్ సప్లయ్ అధికారులను హైదరాబాద్‌కు పిలిపించినట్లు తెలిసింది. ఏం చేద్దామంటూ వారితో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలుగా చర్చలు జరిపినట్లు సమాచారం. కాగా, పేదల బియ్యం పక్కదారి పట్టించిన అక్రమార్కులకు పెద్దలు సహకరించడం.. పైగా చర్యలకు ఉపక్రమించిన అధికారులపైనే ఆగ్రహం ప్రదర్శించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా.. జిల్లా అధికారులను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఓకే అంటే యథాస్థానంలో..

బియ్యం మాయం ఘటనలో కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం నడుచుకోవాల్సి ఉంది. పెద్దల ఒత్తిళ్ల మేరకు రూ.5 కోట్ల జరిమానాకు చెల్లుచీటీ పలికిన రాష్ట్రస్థాయి అధికారులు.. జిల్లా అధికార యంత్రాంగానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలో తెలియక తలపట్టుకున్నట్లు తెలుస్తోంది. పేదల బియ్యం గోల్‌మాల్ ఘటన వెలుగులోకి రాగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు సహకరిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని.. వారు ఓకే అంటే యథాస్థానంలో బియ్యం పెట్టొచ్చని పెద్దలకు రాష్ట్రస్థాయి అధికారులు చెప్పినట్లు సమాచారం.

వందశాతం రుణ లక్ష్యం సాధించాలి



డిజిటల్ సేవ మోడల్ సీఎస్‌సీసెంటర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర, తదితరులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సకాలంలో రుణాలు అందజేసి వందశాతం లక్ష్యం సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో రైతులకు పంట రుణాల పంపిణీ, స్వశక్తి సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణం, మహిళా శక్తి యూనిట్లకు రుణం, ఇతర అంశాలపై డీసీసీడీఏల్‌ఆర్‌సీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2024–25 సంవత్సరానికి సెప్టెంబర్ చివరి నాటికి 45.78 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి హామీ కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులు ఎక్కువగా తిరస్కరణకు గురి అవుతున్నాయని, వీటిని పరిష్కరించి రుణం మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద బ్యాంక్ రుణం, బ్యాంక్ లీకేజీ ద్వారా విరివిగా రుణ సహాయం అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ పెండింగ్ యూనిట్లకు రుణ సహాయం అందించాలన్నారు. నాబార్డ్ డీడీఎం షణ్ముఖ చారి మాట్లాడుతూ వ్యవసాయ మౌలిక వసతుల రుణం కింద రూ.63 కోట్లకు రూ.56 కోట్ల రుణం అందించినట్లు తెలిపారు. ఇంటర్ నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంకులకు ప్రతిపాదనలు పంపిస్తే వీశాట్ పరికరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డెయిరీ సహకార సంఘాలు డీసీసీబీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే మైక్రో ఏటీఎంలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ అధికారి పృథ్వీ, ఎల్‌డీఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో 100 మోడల్ సీఎస్‌సీఐసీటీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మహిళ శక్తి కింద జిల్లాలో 25 మంది మహిళ పొదుపు సంఘం మహిళలను గుర్తించారు. వీరికి పీఎంఈజీపీ ద్వారా రుణం మంజూరు చేయాలని బ్యాంకర్లకు, సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాల జారీచేశారు. అనంతరం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు . కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ బేతోజు హరి కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ఎకో టూరిజం పార్కు మరింత అభివృద్ధి



సోమశిల సమీపంలోని ఎకో టూరిజం పార్కును పరిశీలిస్తున్న అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ

కొల్లాపూర్ రూరల్/పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఎకో టూరిజం పార్కును మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ అన్నారు. బుధవారం అటవీశాఖ అధికారులతో కలిసి ఎకో టూరిజం పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో చేపట్టిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సోమశిల కృష్ణానది తీరంలో ఎకో టూరిజం కింద అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అదే విధంగా నేషనల్ హైవే ప్రాజెక్టుతో పాటు సోమశిల – సిద్దేశ్వరం మధ్య కృష్ణానదిపై కేబుల్ బ్రిడ్జి ప్రతిపాదనలు అటవీశాఖకు అందినట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనుసంధానంగా అటవీ ప్రాంతం పరిధి ఉందని.. ఆయా ప్రతిపాదనలపై అవసరమైన చర్యలు చేపడతామన్నారు. సోమశిలలో ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా సఫారి రివర్ బోటు ఏర్పాటు చేశామన్నారు. నల్లమలలో పర్యాటకులు చూడాల్సిన ప్రాంతాలు అనేకం ఉన్నాయని.. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎకో పార్కులో కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. ప్రధాన రహదారి నుంచి పార్కు పైభాగం వరకు సీసీరోడ్డు నిర్మిస్తామని తెలిపారు. త్వరలోనే పర్యాటకులకు పార్కును అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం సోమశిలలో అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బాచారం అటవీ భూముల పరిశీలన..

పెద్దకొత్తపల్లి మండలం బాచారం సమీపంలోని అటవీ భూములను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ పరిశీలించారు. అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని కొల్లంపెంట, తార్లపల్లి, కుండి చింతల, బైలుతాటి గుండాలపెంట, వటువర్లపల్లి గ్రామాల ప్రజలను బాచారం సమీపంలోని నేషనల్ హైవే–167 పక్కన ఉన్న 6వేల ఎకరాల మైదాన ప్రాంతానికి (అటవీ భూమి) తరలింపునకు సంబంధిత అధికారులు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించే ప్రాంతాన్ని ఆమె పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నల్లమల అభయారణ్యంలోని చెంచులు మైదాన ప్రాంతానికి తరలిరావడానికి సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఇక్కడికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలోఎఫ్‌డీపీటీ రాంబాబు, డీఎఫ్‌ఓ రోహిత్, ఎఫ్‌డీఓలు తిరుమల్‌రావు, రామ్మోహన్, ఫారెస్టు రేంజర్‌లు చంద్రశేఖర్, ఈశ్వర్, సాతాపూర్ సెక్షన్ ఆఫీసర్ వెంకటేష్, ముజీబ్, జయదేవ్ పాల్గొన్నారు.

రూ.1,800 కోట్ల టర్నోవరే లక్ష్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ముగిసేలోగా వచ్చే మార్చి 31 నాటికి రూ.1,800 కోట్ల టర్నోవరే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో గత నెల 30వ తేదీ నాటికి రూ.400 కోట్ల మేర డిపాజిట్లు సేకరించామన్నారు. ఇప్పటివరకు స్వల్పకాలిక రుణాల కింద రూ.670 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.170 కోట్లతో పాటు ఆయా రైతులు, వినియోగదారులు ఏర్పాటు చేసుకునే వివిధ యూనిట్లకు రూ.286 కోట్ల రుణాలు అందజేశామన్నారు. ఆర్‌బీఐ అనుమతితో త్వరలోనే వినియోగదారులందరికీ మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు అందుబాటులో రానున్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య, బ్యాంకు సీఈఓ పురుషోత్తంతో పాటు డైరెక్టర్లు, పీఏసీఎస్ ఎఫ్‌ఏసీఎస్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

సామాన్యులపై బుల్డోజర్

- నాగర్‌కర్నూల్ జిల్లాలో కొంతమంది అధికారుల అత్యుత్సాహం
- దోమలపెంట, మన్ననూరులో అక్రమ నిర్మాణాలంటూ ఇటీవల ఇళ్లను కూల్చివేసిన పంచాయతీ అధికారులు
- రాజకీయ కక్షలే కారణమంటున్న బాధితులు
- కోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోని వైనం
- డీపీఓ సొంత ఖర్చులతో బాధితులకు ఇల్లు నిర్మించాలని హైకోర్టు ఆదేశం



దోమలపెంటలో కూల్చిన ఇంటివద్ద బాధిత కుటుంబం (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: కొంతమంది అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. అక్రమ నిర్మాణాల పేరుతో కొంతమందిపైనే కక్షగడుతూ ఏకంగా ఇళ్లనే కూల్చివేస్తున్న ఘటనలు నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల అమ్రాబాద్ మండలం దోమలపెంట, మన్ననూర్ గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను అక్రమ నిర్మాణాలుగా పేర్కొంటూ గ్రామపంచాయతీ అధికారులు కూల్చివేశారు. వీరికి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బందోబస్తును సైతం ఏర్పాటు చేసింది. కూల్చివేతలపై బాధితులు కోర్టును ఆశ్రయించడంతో స్టే ఉత్తర్వులు ఇచ్చింది. హడావుడిగా కూల్చివేయొద్దంటూ కోర్టు ఉత్తర్వులు ఉన్నా లెక్కచేయకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్నిసార్లు చట్టాలను చేతుల్లోకి తీసుకుని మరీ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు.

కోర్టు ఉత్తర్వులున్నా ఆగని వైనం..

జిల్లాలోని హైదరాబాద్–శ్రీశైలం రహదారిలో మన్ననూరు, దోమలపెంట వద్ద హోటళ్లు, దాబాలు వెలుస్తున్నాయి. వీటిలో కొన్ని అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించడం మంచి పరిణామమే అయినా దీన్ని రాజకీయ కోణంలో వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చాలావరకు దుకాణాలు, ఇళ్లు నిర్మించుకున్నా కొంతమంది వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలకు పాల్పడుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమ్రాబాద్ మండలం దోమలపెంటలో అక్రమంగా నిర్మించారంటూ ఇటీవల పంచాయతీ అధికారులు రెండు హోటళ్లను కూల్చివేశారు. పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి భీముడు ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలోని రక్షిత్ హోటల్‌తో పాటు హైదరాబాద్–శ్రీశైలం రహదారి పక్కనున్న ఆక్షిత్ హోటల్‌ను జేసీబీ సహాయంతో నేలమట్టం చేశారు. అయితే తాము ఏళ్లుగా రేకులషెడ్ నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించినా కూల్చివేస్తామని నోటీసులు ఇచ్చారని బాధితుడు కటకం మహేశ్, నాగలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. దుకాణం నిర్వహణకు ట్రేడ్ లైసెన్స్ సైతం తీసుకుని ఆస్తి పన్ను చెల్లిస్తున్నట్టు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదేమీ పట్టించుకోకుండా అధికారులు బాధితుడి ఇంటిని కూల్చివేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మంగళవారం ఆయన హాజరు కాగా, కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకు సొంత ఖర్చులతో బాధితుడి ఇంటి నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేసింది.

హైకోర్టు ఆదేశాలు పాటిస్తాం..

దోమలపెంటలో ఇల్లు కూల్చివేతపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ఈ మేరకు సొంత ఖర్చులతో బాధితుడికి ఇల్లు నిర్మించి ఇస్తాం. జిల్లావ్యాప్తంగా ఉన్న అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు, చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం.

– రామ్మోహన్‌రావు, డీపీఓ, నాగర్‌కర్నూల్

ప్రజాప్రతినిధుల మెప్పు కోసం ఆరాటం..



మన్ననూరులో అక్రమంగా పొక్లెయిన్‌తో ఇంటిని కూల్చివేయిస్తున్న అధికారులు(ఫైల్)

అచ్చంపేట నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రజాప్రతినిధి మెప్పు కోసం, ఆయన ఆదేశాల మేరకే అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల దోమలపెంటతో పాటు మన్ననూరు గ్రామంలోని నయిముద్దీన్‌కు చెందిన ఇంటిని సైతం అక్రమ నిర్మాణమంటూ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఈ రెండు గ్రామాలకూ ఒక్కరే ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరించడం గమనార్హం. ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకే ఇతర పార్టీలకు చెందిన వారిని టార్గెట్ చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. రాజకీయ పెద్దల మెప్పు పొందేందుకు కొంతమంది అధికారులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులో జాతీయ రహదారి పక్కన సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మూడు, నాలుగు రోజుల క్రితం చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై కేవలం బూడిద రంగు నైట్ ప్యాంట్ మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఠాణాలో సంప్రదించాలని కోరారు.

గద్వాలలో మరో వ్యక్తి మృతదేహం..

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించామని.. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 40 ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పతి మార్చురీలో భద్రపర్చామని.. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి


తేజ (ఫైల్)

మల్దకల్: గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన వీరన్న – సుజాత కుమారుడు తేజ (6)చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య వివరాల మేరకు.. సంగాలకు వీరన్న, అతడి భార్య సుజాత, కుమారుడు తేజతో కలిసి మోటారు సైకిల్‌పై మంగళవారం మల్దకల్ జాతరకు వెళ్లారు. జాతర ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మల్దకల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అయిజ నుంచి గద్వాలకు వస్తున్న కారు వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. కర్నూలులో చికిత్స పొందుతూ తేజ మృతి చెందాడు. కారు డ్రైవర్ పరుశరాముడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



అయిజ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చెరువులో బోల్తా పడిన ఘటన మండలంలోని చిన్న తాండ్రపాడులో బుధవారం చోటు చేసుకుంది. చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన రైతు భానుగౌడ్ తన ట్రాక్టర్‌ను పంట పొలానికి తీసుకెళ్తుండగా అదుపు తప్పి గ్రామ సమీపంలోని లింగమ్మ చెరువులో పడింది. ట్రాక్టర్ నడుపుతున్న భానుగౌడ్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి కిందికి దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

పని కోసం వెళ్లి.. శవమైన యువకుడు


పోల్‌శెట్టి శ్రీను (ఫైల్)

ఖిల్లాఘనపురం: తాపిమేస్త్రీ పనికోసం వెళ్లిన ఓ యువకుడు మూడు రోజుల తర్వాత శవమై గ్రామానికి వచ్చిన ఘటన ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పోల్‌శెట్టి చిన్న చెన్నయ్య, వెంకటమ్మల రెండవ కుమారుడు శ్రీను (33) సోమవారం మేస్త్రీ పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి టీవీఎస్‌పై బయలుదేరాడు. మంగళవారం ఉదయం నాటికి అతడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు.. తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. ఇదిలా ఉండగా.. భూత్పూర్ మండలం పాత మొల్గర వాగు వద్ద మూడు రోజులుగా టీవీఎస్ వాహనం ఆగి ఉండటం.. అక్కడ బట్టలు ఉండటంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు బుధవారం అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని టీవీఎస్ నంబర్ ఆధారంగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పోల్‌శెట్టి శ్రీను వాహనంగా గుర్తించి, ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో మొల్గరకు చేరుకొని వాగులో గాలించారు. నీటిలో చేపల వల కాళ్లకు చుట్టుకుని శ్రీను చనిపోయి కనిపించాడు. చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిర్లక్ష్యం చేయొద్దు.. జాగ్రత్తలు తీసుకోవాలి



– డా.యశ్వంత్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జిల్లా జనరల్ ఆస్పత్రి



చలిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. గొంతునొప్పి, చలి జ్వరం, ఆస్తమా, బ్రాంకైటీస్, నిమోనియా వ్యాపిస్తాయి. దుమ్ము నోట్లోకి చేరడం వల్ల పలు రకాల ఇన్‌ఫెక్షన్స్ వస్తుంటాయి. గాలిలో చల్లని తేమ వల్ల చిన్నారులకు త్వరగా జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. ఉష్ణోగ్రత్తలు తగ్గుతున్న సమయంలో ఇంట్లో వేడి పదార్థాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. చలి తీవ్రతతో వృద్దుల్లో చేతులు వంకర పోవడం వంటి లక్షణాలు ఏర్పడి మరణిస్తారు. దీన్నే ప్రాస్ట్‌బైట్ అంటారు. వృద్ధుల్లో శరీరానికి కావాల్సిన ఉష్ణోగ్రతలు ఉత్పత్తి కాకపోవడంతో మరణాలు సంభవిస్తాయి. దీన్ని వైద్య పరిభాషలో హైపోథెరమి అంటారు. పొడి చర్మం కలిగిన వారిలో దురదలు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. గొంతు ఇన్‌ఫెక్షన్, కీళ్ల నొప్పులు పెరుగుతాయి. కొందరిలో తలనొప్పి వస్తుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. కొంత మందిలో చలి కాలంలో కూడా పొక్కులు వస్తాయి. దీన్ని పాలీమార్ఫస్‌లైట్ ఎరప్షన్ అంటారు. ఎక్కువ సమయం నీళ్లలో చేతులను ఉంచి పనులు చేయడం వల్ల చేతిపై ఉండే నూనె పొర తొలగిపోతుంది. నూనె పొరను కాపాడుకునేందుకు ప్రయత్నించాలి.

– పాలమూరు

ఆస్తమా ప్రమాదకరం..



– డా.సందీప్, పల్మనాలజిస్ట్



ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఎక్కువ మంది అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. చలికాలంలో వాయుకాలుష్యం వల్ల ఆస్తమా సోకుతుంది. ఊపిరితిత్తులలో గాలి చేరడాన్ని అడ్డుకొని శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. ఒక్కోసారి ప్రాణం పోయిందనిపిస్తోంది. దీంతో పిల్లికూతలు, దగ్గు, ఆయాసం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాతావరణంలో వచ్చే మార్పులు ఆస్తమా వ్యాధిగ్రస్తులను మరింత ఇబ్బందులకు గురిచేస్తాయి. పెద్దలతో పాటు పిల్లల్లోనూ జలుబు, దగ్గు, గొంతు సమస్యలు వస్తాయి. అల్ప ఉష్ణోగ్రతలను తట్టుకునేలా శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యేందుకు జీర్ణవ్యవస్థ నిరంతరం పనిచేస్తుండాలి. ఇందుకోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం, తృణధాన్యాలు తీసుకోవాలి. పిల్లలకు ప్రొటీన్లు అధికంగా లభించే కోడిగుడ్లు తదితర పదార్థాలను అందజేయాలి. అప్పుడే శరీరంలో ఉష్ణోగ్రతలు సమతూకంలో ఉంటాయి. రోగనిరోధక శక్తికి నష్టం కలగకుండా చూసుకోవాలి. కేవలం ఆకుకూరలు, కూరగాయలే కాకుండా మూలికలు, సుగంధ ద్రవ్యాలను కూడా తీసుకోవాలి. మధుమేహం, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారు, పెద్ద వయస్కులు వారు ఉదయం వేళ నడకకు వెళ్లవద్దు. వీరు సాయంత్రం 4నుంచి 5గంటల మధ్య నడకకు వెళ్తే బాగుంటుంది. దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారు ఉదయం 8 గంటల వరకు బయటికి రావద్దు. చలికాలంలో వ్యాయామానికి బద్ధకించవద్దు. కనీసం 20 నిమిషాలైనా కసరత్తు చేయాలి.

– పాలమూరు

హైవేపై దారి దోపిడీ


పెబ్బేరు పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై దారి దోపిడీకి గురైన కారు ఇదే..

కత్తులు, రాళ్లతో దాడి చేసిన దుండగులు

- 14 తులాల బంగారు నగలు చోరీ
- నలుగురికి గాయాలు.. బాధితులు జగిత్యాల వాసులుగా గుర్తింపు
- వనపర్తి జిల్లా పెబ్బేరు శివారులో సంఘటన
- ఐదు బృందాలతో విచారణ

వనపర్తి: గుర్తు తెలియని ఐదుగురు దుండగులు రోడ్డుపక్కన ఆగి ఉన్న యాత్రికుల వాహనంపై దాడిచేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులో 44వ నంబర్ జాతీయరహదారిపై చోటు చేసుకుంది. బాధితులు, డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం తీర్థయాత్రలకు తిరుపతి, అరుణాచలం, కంచి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం తెల్లవారుజామున పెబ్బేరు పట్టణ శివారులోని ఎంవీఐ కార్యాలయం ఎదుట ఎడమ వైపు ట్రక్ పార్కింగ్ వద్ద వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకున్నారు. వారు గాఢనిద్రలో ఉండగా.. గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు స్వెట్టర్లు, మాస్కులు ధరించి రాళ్లు, కత్తులతో దాడి చేశారు. కారులో ఉన్న వారు వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ.. దుండగులు ఆ వాహనం వెనక టైర్‌కు అడ్డంగా పెద్దరాళ్లు పెట్టడంతో సాధ్యం కాలేదు. రోడ్డుకు కుడి వైపు ఉన్న టాయిలెట్స్ శుభ్రం చేసే వ్యక్తి.. గదిలో నిద్రిస్తున్నట్లు గమనించిన దుండగులు దాడి చేసే సమయంలో నిద్ర లేచే అవకాశం ఉందని అతను బయటికి రాకుండా గదికి గడియపెట్టారు. కారుపై ఉంచిన యాత్రికుల వస్తువులు, బ్యాగులను ఎత్తుకెళ్లడంతో పాటు కారులోని మహిళల మెడల్లో ఉన్న బంగారం గొలుసులను బలవంతం లాక్కున్నారు. కారులో మొత్తం ఎనిమిది మంది ఉండగా.. వారిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ ప్రణీత్‌పై రాళ్లు, కత్తితో దాడి చేయగా అతను అక్కడే స్పృహ కోల్పోయాడు. మిగతా వారు దాడి చేసే వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేసినా.. వారు రాళ్లతో దాడి చేయడంతో అడ్డుకోలేకపోయారు. మహిళల వంటిపై ఉన్న సుమారు 14 తులాల బంగారునగలను అపహరించుకుని వెళ్లారు. బాధితులు 100కు డయల్ చేయటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌కు రప్పించి గాయాల పాలైన వారిని వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. జీజీహెచ్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో సంతోష్, రాజేశ్వర్‌తో పాటు డ్రైవర్ ప్రణీత్, బాలుడు శ్రీకాంత్ ఉన్నారు. మహిళలు సునీత, సరస్వతి, రజినిల మెడల్లోని గొలుసులను బలంగా లాగటంతో వారికి మెడ భాగంలో స్వల్ప రక్తగాయాలయ్యాయి.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రావుల గిరిధర్

విషయం తెలుసుకున్న ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.వాహనంలో పడి ఉన్న రాళ్లు, సంఘటన స్థలంలో పడేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ రాంబాబు నేతృత్వంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.


రోడ్లపైకి ఆర్డీఎస్ నీరు

- కోతకు గురైన డీ–30 కాల్వ


నారాయణపురం గ్రామంలో ప్రవహిస్తున్న ఆర్డీఎస్ కాల్వ నీరు.

మానవపాడు: ఆర్డీఎస్ కాల్వ కోతకు గురై నారాయణపురం గ్రామంలో బుధవారం రోడ్లపై ఆ నీరు ప్రవహిస్తోంది. మండలంలోని నారాయణపురం గుండా డీ–30 కాల్వ వెళ్తుంది. కాల్వలో పూడిక తీయకపోవడంతో నీరు ఎక్కువై గ్రామంలో ప్రవహిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చిన్నరాజమూర్‌కి పోటెత్తిన భక్తులు


దేవాలయ ప్రధాన ద్వారంవద్ద భక్తులు

ప్రత్యేక అలంకారంలో ఆంజనేయ స్వామి

- దాసంగాలతో నైవేద్యాల సమర్పణ


అంజన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పూజారులు

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి దాసంగాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఆవులను, కోడెలను ఆలయానికి అందజేశారు. పోర్లు దండాలు, గండజ్యోతులతో ప్రదక్షిణలు చేశారు. కోనేరు వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. నీటిలోకి వెళ్లకుండా ప్రత్యేకంగా ఇనుప జాలీలతో కంచెను ఏర్పాటుచేశారు. దేవస్థానం వారు పులిహోర, లడ్డు ప్రసాదాలను విక్రయించారు. జాతరలో స్వీట్లు షాపులు, గాజులు, బొమ్మల షాపులు వెలిశాయి. జోరుగా వ్యాపారాలు కొనసాగాయి. రెండు వారాలు జాతర కొనసాగే అవకాశముంది. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూడు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి వస్తువుల అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని విలియం కొండతండాలో బుధవారం రాత్రి మూడు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. తండాకు చెందిన ముడావత్ రవి నాయక్, రాత్లావత్ రాజు, రాత్లావత్ బాబు ఇళ్లకు తాళాలు వేసి హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. బుధవారం ఉదయం పక్కింటి వారు తాళాలు తీసి ఉండటం గమనించి ఆయా ఇళ్ల వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న వారు ఇళ్లలోకి వెళ్లి చూడగా బీరువాల తలుపులు పగులగొట్టి ఉండటం.. అందులోని బంగారు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి పరిశీలించి జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రాష్ట్రంలోకి కర్ణాటక వరి ధాన్యం?

మాగనూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి కర్ణాటకలోని బద్దేపల్లి, అజిలాపూర్, దుప్పలి, ఇడ్లూరు తదితర గ్రామాల నుంచి నిత్యం ట్రాక్టర్లలో వరి ధాన్యం వస్తోందని.. వారికి కార్యాలయంలోని ఓ అధికారి సహకరిస్తున్నారని మండల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఇక్కడి గన్నీ బ్యాగులను కర్ణాటకకు పంపించి గుట్టు చప్పుడు కాకుండా తీసుకొస్తున్నారని తెలుస్తోంది. మండలంలోని తాళంకేరి దగ్గర చెక్ పోస్టు లేకపోవడంతో ఇదే అదునుగా భావించి ధాన్యాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కర్ణాటక కంటే ఇక్కడ ధర అధికంగా ఉండటం.. అదనంగా బోనస్ వస్తుండటంతో ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి పోలప్ప వద్ద ప్రస్తావించగా కర్ణాటక నుంచి వరి ధాన్యం వస్తున్నట్లు తమ దృష్టికి బుధవారం వచ్చిందని.. ఈ విషయంపై దృష్టి సారించామని, అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

నాగర్‌కర్నూల్ క్రైం: తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన ప్రవీణ్, నూర్జహాన్ చాలారోజులుగా ప్రేమించుకుంటున్నారు. వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆమె షీటీంను ఆశ్రయించింది. షీటీం ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపించగా ఇటీవలే విడుదలయ్యాడు. తాజాగా బుధవారం నూర్జహాన్ ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు కోర్టులో ఉందని తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని సముదాయించి పంపించారు.

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలి


ఫుట్‌బాల్ విన్నర్, రన్నర్ జట్లతో అధికారులు, పీడీలు

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ.వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు బుధవారం మూడోరోజుకు కొనసాగాయి. ఆర్చరీ, ఫుట్‌బాల్, తైక్వాండో, కరాటే పోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఫుట్‌బాల్ పోటీలకు వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

జాతీయస్థాయికి ఎదగాలి

జిల్లా క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎదగాలని పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ జిల్లాస్థాయి కరాటే ఎంపికలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో టీజీ పీడీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి విలియం, పీడీలు వేణుగోపాల్, నిరంజన్‌రావు, వడెన్న, పరశురాం, భానుకిరణ్, మొగులాల్, కృష్ణ, ఉమాదేవి, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగియనున్న జిల్లాస్థాయి క్రీడలు

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు గురువారం ముగియనున్నాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, బాక్సింగ్ క్రీడలతోపాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సాయంత్రం ముగింపు వేడుకలు నిర్వహించి విజేత జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు.

కరాటే ఎంపికల వివరాలు

జిల్లాస్థాయి కరాటే ఎంపికల్లో 14–15 ఏళ్ల విభాగం – 52కేజీలో శివప్రసాద్, –57కేజీలో శ్రీకర్‌రెడ్డి, –63కేజీలో విశాల్, 63కేజీలో తేజవర్ధన్, 47కేజీలో షాఫియా తస్లిం, 54కేజీలో గాయత్రి, 54కేజీలో వైష్ణవి.

- సీనియర్–18 ఏళ్లపైబడి విభాగం 55కేజీలో ఎండి.అర్ష్ జమీల్, 60కేజీలో మొయినొద్దీన్, 75కేజీలో లక్ష్మణ్, +75కేజీలో హుజేఫ్ షరీఫ్, –55కేజీలో డి.వీణ,
- జూనియర్ 16–17 ఏళ్ల విభాగం 55కేజీలో అభిలాష్, 61కేజీలో బాలే షరీఫ్, 63కేజీలో చందు, 53కేజీలో మహిమాన్విత, 59కేజీలో ఐశా తస్లీంలు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు క్రిష్ణయ్య, తాజుద్దీన్, ఇలియాజ్, శంకర్‌నాయక్, సాలం బిన్ ఉమర్, శివకుమార్, నవీన్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత మహబూబ్‌నగర్

జిల్లాస్థాయి సీఎం కప్ ఫుట్‌బాల్ సీనియర్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 2–1 గోల్స్ తేడాతో జడ్చర్లపై జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో జడ్చర్ల జట్టు 2–0 గోల్స్‌తో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది.

ఆర్చరీ ఫలితాలు

ఆర్చరీ బాలుర కాంపౌండ్‌లో ఎస్.విష్ణువర్ధన్, బాలికల్లో ఆర్.సుజాత, ఇండియన్ రౌండ్ బాలురలో రామావత్ రవి, బాలికల్లో కె.సునీత విజేతలుగా నిలిచారు.

దిగి వచ్చిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.3,610.. కనిష్టంగా రూ.1,700


విక్రయానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. నాలుగు వారాలుగా పెరిగిన ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి హైదరాబాద్, కర్నూలు ప్రాంతాలకు ఉల్లి దిగుమతి కావడంతో ధరలు తగ్గాయి. గత వారం గరిష్ఠంగా రూ.5,100 వరకు ఉండగా.. ఈ వారం రూ.3,610 పలికింది. అంటే ఏకంగా రూ.1,500 వరకు తగ్గింది. కనిష్టంగా రూ.1,700 ధర నమోదైంది. గత వారం కనిష్టంగా రూ.3,100 ధర ఉండగా.. సుమారు రూ.1,400 వరకు తగ్గింది. 45 కిలోల బస్తా గరిష్ఠంగా రూ.1,800, కనిష్టంగా రూ.850కి విక్రయించారు.

శ్రీశైలం జలాశయంలోకి 7,870 క్యూసెక్కులు పంపింగ్

దోమలపెంట: భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతి ద్వారా 24 గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి 7,870 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,695, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం శ్రీశైలం జలాశయంలో 863.4 అడుగుల వద్ద 116.6364 టీఎంసీల నీటినిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

క్లుప్తంగా

ఆందోళనను ఉధృతం చేస్తాం

అడ్డాకుల: పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరారు. కుర్మయ్య, వెంకటేష్, రవిసాగర్ ఉన్నారు.

భూత్పూర్ : చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లే పంచాయతీ కార్మికులను వారి ఇళ్ల వద్దనే అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి అన్నారు. పంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు చలో హైదరాబాద్ వెళ్లే వారిని అడ్డుకున్నందుకు నిరసనగా ఎంపీడీఓ ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్మిక సంఘాల జేఏసీ మండలాధ్యక్షుడు మైబు, వెంకటేష్, నరసింహ, నాగరాజు, బండి చంద్రమ్మ, అంజమ్మ, కృష్ణయ్య, నాగన్న తదితరులున్నారు.

మహిళలకు ప్రత్యేక గదులు కేటాయిస్తాం



జడ్చర్ల టౌన్: గ్రంథాలయంలో మహిళలు చదువుకునేందుకు ప్రత్యేక గదులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కావేరమ్మపేట శాఖ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. పాఠకులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రంథాలయంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, సిబ్బంది భీష్మాచారి, స్థానికులు బుక్క వెంకటేశం, జగదీశ్వర్‌చారి, రాంప్రసాద్, శివ తదితరులున్నారు.

కోర్టుకు హాజరైన ఉద్యమకారులు



పాలమూరు, జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో 2011లో జరిగిన సకల జనుల సమ్మెలో భాగంగా ఆర్టీసీ బస్సులను అడ్డుకుని ప్రజారవాణాకు ఆటంకం కలిగించారని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 25మంది ఉద్యమకారులపై కేసు నమోదైంది. ఈ కేసు బుధవారం జిల్లా కోర్టులో విచారణకు రాగా ఉద్యమకారులు హాజరయ్యారు. ఈకేసు తిరిగి జనవరి 31కి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయి పదేళ్లు గడుస్తున్నా ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఇంకా మాఫీ కాలేదని అన్నారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని టీఎస్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేసును కొట్టివేయాలని వారు కోరారు. కోర్టు హాజరైన వారిలో చంద్రనాయక్, చంద్రకాంత్‌రెడ్డి ఉన్నారు.

మాట నిలబెట్టుకోవాలి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటిస్తానని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మండల జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్ గేటు వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. పది గ్రామాల ప్రజల మద్దతు ఉన్న గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించి రాష్ట్రప్రభుత్వం ప్రజల మన్ననలు పొందాలన్నారు. మాజీసర్పంచ్‌లు హనుమంతు, భోజ్యానాయక్, శ్రీహరిగౌడ్, ఆంజనేయులు, వెంకటేష్, నరేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ జమిస్తాపూర్ గ్రామ అధ్యక్షుడు కిషన్ డిమాండ్ చేశారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో జరిగే ఆటో యూనియన్ మహాసభల పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఆటో కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు 22న ఆటోకార్మికుల రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఆటోకార్మికులు అధికసంఖ్యలో హాజరై జయప్రదంచేయాలని కోరారు. యూనియన్ గ్రామ ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్, రాఘవేందర్, మహేష్, నాగరాజు ఉన్నారు.

మందులు పంపిణీ

జడ్చర్ల: మండలంలోని చిట్టెంబోయిన్‌పల్లి గురుకుల విద్యాలయంలో బాల ఆరోగ్య సంవర్ధిని ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై డాక్టర్లు అవగాహన కల్పించారు. రెండు రోజులుగా దాదాపు 600 మంది బాలికలకు వైద్యపరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పొగమంచుతో ప్రమాదం

- రఘుకుమార్, ఆర్టీఓ, మహబూబ్‌నగర్





మహబూబ్‌నగర్ క్రైం: చలికాలంలో రాత్రి వేళల్లో కురిసే పొగమంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు, మనుషులు సైతం కనిపించని పరిస్థితి. రోడ్డుపై పూర్తిగా మంచు కమ్ముకొని ఉండి ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించే లోపు ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపేయడం ప్రమాదకరం. వెనుక నుంచి కానీ ఎదురుగా కానీ వచ్చే వాహనాలను గమనించక ఢీకొనే సంఘటనలు తరచూ జరుగుతుంటాయి. ఒక్కోసారి విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. వాహనాలకు వెనుక, ముందు రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలి. వాహనానికి ఫాగ్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి. పసుపు రంగుతో వెలిగే లైట్స్ ఈ చలికాలంలో ఎంతో ఉపయోగపడుతాయి.ఈ కాలంలో రాత్రివేళ, వేకువజామున ప్రయాణాలను తగ్గించుకుంటే మంచిది. మంచు ఎక్కువగా కురుస్తున్న సమయంలో వాహనదారులు పలు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగకుండా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. వేగం తక్కువగా ఉండటంతో పాటు వాహనం పూర్తిగా కండీషన్‌లో పెట్టుకోవడం, ఇంజిన్, టైర్లు, ముందు అద్దాలు సరిగ్గా ఉండే విధంగా చూసుకోవాలి.

జాగ్రత్తలతో పశుపక్షాదులను కాపాడుకోండి

- డాక్టర్ మధుసూదన్‌గౌడ్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి





మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తగిన జాగ్రత్తలతో పశుపక్షాదులను కాపాడుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.మధుసూదన్‌గౌడ్ అన్నారు. రోజురోజుకు తగ్గుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో బుధవారం 'సాక్షి'తో పశువులు, పెంపుడు జంతువుల సంరక్షణపై ఆయన సూచనలు, సలహాలు చేశారు.

- శీతాకాలంలో పాడి పశువుల ఆరోగ్యం విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో జీర్ణవ్యవస్థ మందగించడం, పోషకాలు తగ్గి పాల ఉత్పత్తి తగ్గుతుంది.
- ఈదురు గాలుల నుంచి రక్షించేందుకు గోనె సంచులు, ఖాళీ ఎరువుల సంచులతో పాక చుట్టూ పరదాలు ఏర్పాటుచేయాలి. పాక లోపల దోమల నివారణకు వరి పొట్టుతో కుంపట్లు లేదా లావు కట్టెలను మండించాలి. వేపాకు పొగను ఓ మూలన వేయాలి.
- దూడలను చలి నుంచి రక్షించేందుకు గోనె సంచితో లేదా పాత బట్టలతో డ్రెస్‌లాగా కుట్టించి తొడిగించాలి.
- మేత కోసం తెల్లవారుజామున కాకుండా ఎండ వచ్చేవేళ బయటకు వదలాలి. పరిశుభ్రమైన ఆహారం, నీరు అందించాలి. పశువుల్లో జీర్ణక్రియ మందగించకుండా పచ్చిమేతతో పాటు ఒట్టిమేతను కూడా ఇవ్వాలి.

మెనూ పాటించకపోతే చర్యలు

- కలెక్టర్ విజయేందిరబోయి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

గండీడ్: పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వంట గది, స్టోర్ రూంలను పరిశీలించారు. వంట గదిలో బొగ్గులు, స్టోర్ రూంలో విరిగిపోయిన కుర్చీలు, పాడైన సామగ్రి కనిపించడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. నిత్యం ఎక్కడో ఓచోట ఫుడ్ పాయిజన్ సంఘటనలు పునరావృతం అవుతున్నా ఎందుకు స్పందించడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. ముందుగా ఫుడ్ సేఫ్టీ కమిటీ భోజనాన్ని పరిశీలించి సంతృప్తి చెందాక విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. ఆస్పత్రిలో డెలివరీలు ఏమేరకు జరుగుతున్నాయనే దానిపై మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ సర్వేను పరిశీలించి రోజుకు 50మందికి తగ్గకుండా సర్వే చేయాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ధరణిలో ఎన్ని పెండింగ్ సమస్యలున్నాయని తహసీల్దార్ నాగలక్ష్మిని అడిగితెలుసుకున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల మధ్య నిర్మిస్తున్న ప్రహరీని వెంటనే ఆపేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ మాధవి ఉన్నారు.

అబద్ధపు హామీలతో అధికారం

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దేవరకద్ర రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం కొౌకుంట్ల మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావివ్వొద్దని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడిగా బాలచందర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడిగా రాఘవేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంపీటీసీ కిష్టన్న, మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,హర్షవర్ధన్ రెడ్డి, తుమ్మల శేఖర్ రెడ్డి, రవి, శివరాజ్, కిరణ్, శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



వీరన్నపేటలో మురుగు గుంతను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం 28, 31వ వార్డుల పరిధిలోని కుమ్మరివాడి, వీరన్నపేట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని, భగీరథ నీరు పూర్తి స్థాయిలో అందడం లేదని, చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, వీధి దీపాలు లేవని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, మోసిన్, రఘు, సత్యం, జగదీష్, ఫైజల్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా



చెక్కును అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దతండాలో దేవిజానాయక్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి రూ.1.50లక్షలు విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, రాములు, ఠాగూర్, టీక్యానాయక్, గోపాల్, అంబ్రియా, పాండు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా

- మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం



నవాబుపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో పాలకవర్గం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగం మాట్లాడారు. రైతులకు అన్ని సదుపాయలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ ఆదాయం పెంచేలా ప్రణాళిక చేస్తున్నట్లు ఆయన వివరించారు. సహకార సంఘం చైర్మన్ నర్సింహులు, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, మార్కెట్ కార్యదర్శి రమేష్, డైరెక్టర్లు కుమార్, నరేష్, వెంకటేష్, పద్మమ్మ, రాఘవేందర్, చందు , పురుషోత్తం పాల్గొన్నారు.

అభివృద్ధిని చూపిస్తాం.. చర్చకు సిద్ధమా

- కాంగ్రెస్ నాయకుల సవాల్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

భూత్పూర్: దేవరకద్ర నియోజకర్గంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి చూపిస్తామని, చర్చకు సిద్ధమా అంటూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. బుధవారం ఆయన భూత్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఇటీవలే విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేపై అసతఆరోపణలు చేశారని, నిజనిజాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు. సీసీకుంట జూనియర్ కళాశాల, దేవరకద్రకు డిగ్రీ కళాశాలతో పాటు ఇంట్రిగ్రేట్ రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు కురుమూర్తికి రూ.34కోట్లతో నీటి సరఫరా, రూ.110 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్‌నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు హర్యానాయక్, మాధవరెడ్డి గోవర్ధన్‌గౌడ్, బోరింగ్ నర్సింహులు, విజయ్‌గౌడ్, పవన్‌కుమార్, మశ్చందర్, ఎల్లప్ప, నర్సింహులు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శ్రీనివాసకాలనీ, పంచముఖ కాలనీలోని పార్కులను బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న పిచ్చిమొక్కల తొలగింపు పనులను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అంతకుముందు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సీనియర్ సిటిజన్స్‌తో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



డాక్టర్ రమాకాంత్‌ను సన్మానించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండ్‌లోని ఆర్టీసీ క్లినిక్‌కు నూతనంగా నియమితులైన డాక్టర్ రమాకాంత్‌ను బుధవారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రెండు నెలల నుంచి క్లినిక్‌లో డాక్టర్, ఫార్మాసిస్ట్ లేరని, మందులు సరఫరా లేక విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందులు తెప్పించి మెరుగైన వైద్యమందించాలని కోరారు. ఇన్‌చార్జి డాక్టర్ వినీత, నాయకులు భగవంతు, ఉమేష్‌కుమార్, కేఆర్.రెడ్డి, డేవిడ్, రియాజుద్దీన్, మనోహర్, నారాయణ పాల్గొన్నారు.

దుందుభీ తీరంలో అయ్యప్ప శరణుఘోష



రాజాపూర్(బాలానగర్)/నవాబుపేట: బాలానగర్ మండలంలోని దుందుభీ తీరం గల హరిహర సుతుడు అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. బుధవారం రాత్రి అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. గురుస్వాములు అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం, పూలాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తిగీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్మాతికతను సంతరించుకుంది. వివిధగ్రామాల నుంచి అధికసంఖ్యలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

- నవాబుపేట మండలంలోని చెన్నరెడ్డిపల్లిలో అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. వెంకటేష్ గురుస్వామి పూజా కార్యక్రమాన్ని నిర్వహించగా వందలాది మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా 'సిడే'

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



సిడే ఉత్సవంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని రామచంద్రాపూర్‌లో బుధవారం సాయంత్రం శ్రీఎల్లమ్మ దేవత సిడే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామచంద్రాపూర్ ఊరగుట్టపై కొలువుదీరిన కాళికాదేవి దేవస్థానం నుంచి ఎల్లమ్మ దేవతకు సిడే తిప్పే గొర్రె పొట్టేళ్లను గ్రామంలోని బొడ్రాయి వరకు బ్యాండ్, భక్తుల హరినామస్మరణల మధ్య ఊరేగించారు. సిడే గొర్రె పొట్టేళ్లను శోభాయమానంగా అలంకరించిన ఎద్దుల బండిపై ఉత్సవ నిర్వాహకులు కుర్వ ఆనంద్ ఆధ్వర్యంలో తేరు మైదానంకు తీసుకెళ్లారు. ఈ ఊరేగింపునకు భక్తులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. తేరు మైదానం వద్ద సిడేకు ప్రత్యేక పూజలు చేశారు. గుడి చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేశారు. కొంతమంది శివసత్తులు ఈ సిడే ఊరేగింపులో పూనకాలు నిండారు. తేరు మైదాన ప్రాంతమంతా ఆధ్యాత్మికతను సంతరించుకుంది. సిడేకు కట్టి తిప్పిన గొర్రె పొట్టేళ్లను మళ్లీ ఊరేగింపుగా కాళికాదేవి దేవస్థానం గుట్టపైకి తీసుకెళ్లి వదిలిపెట్టారు. దేవరకద్ర, కోయిలకొండ, మహబూబ్‌నగర్ మండలాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. ఆలయ ధర్మకర్త కుర్వ ఆనంద్, మాజీ సర్పంచ్ కుర్వ రాణెమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య, ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటయ్య, బాబురావు, కృష్ణాచారి, వీరన్న పాల్గొన్నారు.

ఐకార్ శాస్త్రవేత్తగా గ్రీష్మారెడ్డి ఎంపిక



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఐకార్ భారత వ్యవసాయ మండలి శాస్త్రవేత్తగా జిల్లాకు కోయిల్‌కొండ మండలం, విఠామూర్‌గ్రామానికి చెందిన కొత్తూర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్న దంపతులు కుమార్తె కొత్తూరు గ్రీష్మారెడ్డి ఎంపికయ్యారు. ఈమేరకు జాతీయ స్థాయి అగ్రికల్చర్ రీసెర్చి సర్వీసెస్ పరీక్షలో ఆమె ప్రతిభ కనబర్చి ప్లాంట్ పాథాలజీ విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలో చీడపీడల నివారణ కోసం కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగం సాధించిన ఆమెను పలువురు అభినందించారు.

సిఫార్సులు అమలుచేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమం కోసం సచార్ కమిటీ, రంగనాథ్‌మిశ్రా కమిషన్ల సిఫార్సులు అమలుచేయాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా డిమాండ్ చేశారు. బుధవారం ఆసంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 18న మైనార్టీ దినోత్సవంగా అమలు చేయాలని కోరారు. జేపీసీ ద్వారా దేశవ్యాప్తంగా మైనార్టీల సమస్యలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత దక్కేలా రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, మహబూబ్ అలీ పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

నవాబుపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మరింత వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. బుధవారం మండలంలోని లోకిరేవు, కాకర్లపహాడ్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కొన్నిగ్రామాల్లో నెట్‌వర్క్ సరిగా లేక సర్వే ఆలస్యమవుతుందని అన్నారు. మండల వ్యాప్తంగా 15,418 ఇళ్ల ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2వేలు ఇళ్లు పూర్తి చేశామన్నారు.

కార్మిక సంఘాల సంబరాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2020లో జిల్లా కేంద్రంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నవారిపై అప్పట్లో కేసు నమోదైంది. బుధవారం మహబూబ్‌నగర్ మూడో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయమూర్తి ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించి కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. కోర్టు ఎదుట ఆయా కార్మికసంఘాల నాయకులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. న్యాయవాది ఆర్.ఆర్.మన్యం, కార్మిక సంఘాల నాయకులు కురుమూర్తి, సురేష్, వెంకటేష్, రాములు యాదవ్, సత్యనారాయణరెడ్డి, రాంమోహన్, చంద్రకాంత్, ఖమర్‌అలీ, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌మెనూతో పౌష్టికాహారం

జడ్చర్ల టౌన్: కామన్‌డైట్ మెనూతో విద్యార్థినులకు పౌష్టికాహారం అందుతోందని ఎంఈఓ మంజులాదేవి తెలిపారు. బుధవారం దేవునిగుట్టతండా సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో కామన్‌డైట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. మారిన డైట్ అమలు అవుతుందా లేదా విచారించారు. కామన్‌డైట్ చార్ట్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. డైట్ అమలు పట్ల విద్యార్థినులు పర్యవేక్షించాలన్నారు. ఏదైనా మార్పు వస్తే వెంటనే మెస్ ఇన్‌చార్జి, ఎస్ఓకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పెట్టుబడి తగ్గించుకునే పద్ధతులు అవలంబించాలి

అడ్డాకుల: పంటలు సాగు చేసే రైతులు పెట్టుబడిని తగ్గించుకునే పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మూసాపేట మండలం చక్రాపూర్‌లో వరిని వెదజల్లే విధానంలో సాగు చేస్తున్న రైతు పొలాన్ని బుధవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. నేరుగా విత్తుకునే పద్ధతిలో ఎకరానికి కేవలం 10నుంచి 12 కేజీల విత్తనం సరిపోతుందన్నారు. కూలీల కొరతను అధిగమించడంతో పాటు నారుమడి పెంచే సమయం, పెట్టుబడి ఆదా అవుతుందని తెలిపారు. ఎకరానికి రూ.7వేల నుంచి రూ.8వేల ఖర్చు తగ్గుందన్నారు.

హక్కులు కాలరాస్తే సహించం

నవాబుపేట: మాలల హక్కులను కాలరాస్తే సహించమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కావి రమేష్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భావ్యం కాదన్నారు.

మత్స్యకారులకు శిక్షణ

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో బుధవారం మత్స్యకారులకు వృత్తి నైపుణ్య శిక్షణ నిర్వహించారు. మత్స్యశాఖ జిల్లా ఏడీ రాధారోహిణి, రంగారెడ్డి జిల్లా ఏడీ పూర్ణిమ, మత్స్యశాఖ జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు గంజి ఆంజనేయులు ఆధ్వర్యంలో 135 మంది మత్స్యకారులకు శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలోని కొౌకుంట్ల, కప్పెట, సుంకరామయ్యపల్లి, మహబూబ్‌నగర్ మండలంలోని బుద్దారం, తెలుగుగూడెంకు చెందిన మత్స్యకారులకు శిక్షణలు ఇచ్చి వారికి రుణాలు, సంఘం సభ్యత్వాలు ఇస్తామని అధికారులు తెలిపారు.